క్లుప్తంగా

యేసుమార్గమే జీవమార్గం



సువార్త సభలో ప్రసంగిస్తున్న బైబిల్ మిషన్ సభ్యులు

హిందూపురం టౌన్: యేసు చూపిన మార్గమే జీవమార్గం, శాంతిమార్గమని బైబిలు మిషన్ సభ్యులు స్తోత్రం రాజు, ప్రభాకర్ రాజు అన్నారు. బైబిలు మిషన్ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని లక్ష్మీపురంలో బైబిలు మిషను స్వస్థతశాల సువార్త సభలు మొదటి రోజు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ మంచి మార్గంలో, శాంతి మార్గంలో నడవాలన్నారు. ఏ మతమును , ఏ కులమును, మనిషిని దూషించకూడదన్నారు. సన్మార్గంలో నడిచే ప్రతి ఒక్కరిని యేసు రక్షిస్తారన్నారు. అనంతరం పాస్టర్ దేవరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఏలూరులోని జేఏసీపీయం చర్చి పాల్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు రత్నగిరిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో గురువారం ఉదయం 7.30 గంటలకు మూడోరోజు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

19న చలో మదనపల్లి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మదనపల్లిలో ఈ నెల 19న జరిగే బహుజన రాజ్యాధికార సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో చలో మదనపల్లి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు హరికుమార్, రామాంజి, సుబ్బరాయప్ప, ఈశ్వరయ్య, నారాయణ, హారుణ్, నవీన్, నరసింహులు, గంగాధర్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ఈరన్న (ఫైల్)

అమరాపురం: మండలంలోని ఆలదపల్లికి చెందిన గ్రామ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్న (54) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ స్వారక్క, సర్పంచులు గిరిజమ్మ, వాగేష్, ఎంపీటీసీలు కెంచప్ప తదితరులు ఆలదపల్లికి వెళ్లి ఈరన్న మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. మృతుడికి భార్య పుట్టమ్మ, కుమారులు ఉన్నారు.

ప్రేమానురాగాలతో జీవించాలి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ ప్రేమానురాగంతో జీవించాలని, ఒకరికొకరు సహాయంగా నడవాలని డీఎస్పీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. పట్టణంలోని బైబిల్‌మిషన్ చర్చిలో బుధవారం బైబిల్ మిషన్ మోక్ష మార్గం ఉప దేశ సభలు 2వ రోజు విజయవంతంగా జరిగాయి. పాస్టర్ సుధాకర్ బైబిల్ సందేశాన్ని వివరించారు.


జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



హారిక



హేమవతి



స్నేహ

పరిగి: మండలంలోని ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పరిగి జెడ్పీ స్కూల్ పీడీ ప్రకాష్ రెడ్డి తెలిపారు. పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు హారిక, స్నేహ, హేమవతి ఈనెల 9 నుంచి 13 వరకూ భోపాల్‌లో జరిగే అండర్ 19 స్కూల్ నేషనల్ ఫుట్‌బాల్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొంటారన్నారు.

డీటీ మృతికి సంతాపం

అమరాపురం: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డీటీ కరుణాకర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్, సిబ్బందితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, నారాయణ, సురేష్‌కుమార్, జేకే.మూర్తి, త్రిలోక్‌నాథ్, శివకుమార్ తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.

పూల సాగుకు కేరాఫ్ మరువపల్లి

- ప్రధాన జీవనాధారంగా మార్చుకున్న గ్రామస్తులు
- ప్రధాన పంట సాగు ఏది ఉన్నా పూలసాగుకు ప్రత్యేకంగా స్థలం
- భూమి లేనివారుసైతం పూలుకొని విక్రయిస్తున్న వైనం



పి.మరువపల్లిలో సాగు చేసిన కనకాంబరాలు కోస్తున్న మహిళలు

పెనుకొండ రూరల్: ఆ పల్లెలో అందరూ పూల సాగునే తమ జీవనాధారంగా మార్చుకున్నారు. ప్రధాన పంట ఏం వేసినా పూల సాగుకు కచ్చితంగా ప్రత్యేకంగా భూమిని కేటాయించారు.

సెంట్ ఫ్యాక్టరీ ఉండటంతో..

పెనుకొండ మండలం పూల (పి) మరువపల్లిలో పూల సాగు, వ్యాపారంపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. పాతికేళ్లకు పైగా వారికి ఇదే ఆదరవుగా మారింది. ఈ గ్రామంలో 380 గృహాలు ఉండగా దాదాపుగా 1443 మంది జనాభా ఉన్నారు. ఊళ్లో వ్యవసాయ బోరు ఉన్న ప్రతి ఒక్కరూ పూల సాగు ప్రత్యేక భూమిని కేటాయించారు. గతంలో ఇక్కడ సెంట్ ఫ్యాక్టరీ ఉండేది. ఇందులో భాగంగానే స్థానికులంతా పూలు సాగు చేస్తూ ఆ ఫ్యాక్టరీ నిర్వాహకులకు విక్రయించేవారు. ఇప్పుడు ఆ ఫ్యాక్టరీ లేకపోయినా పూలసాగును మాత్రం వారు వీడలేదు.

భూమి లేకపోయినా....

పి.మరువపల్లిలో ఎక్కువగా మల్లె మొగ్గలు, గుండు మొగ్గలు, జాజి మొగ్గలు, కనకాంబరాలు, చామంతి, ముద్దబంతి పూలను ఎక్కువగా సాగు చేస్తారు. పండిన పంటను పెనుకొండ పట్టణంలోని కొందరు దళారులకు హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయిస్తారు. వ్యవసాయ భూమిలేనివారు సైతం గ్రామంలోనే పూల మొగ్గలను కేజీలు వంతున కొనుగోలు చేసి, వాటిని కట్టి పట్టణాలలో విక్రయిస్తారు. వ్యవసాయ పొలం ఉన్నవారికైనా, లేనివారికైనా ప్రధాన ఆదాయ వనరు మాత్రం పూలే కావడం విశేషం.

త్వరలోనే పూల మార్కెట్...

పి.మరువపల్లిలో రైతులు అధిక సంఖ్యలో పూల సాగు చేస్తుండటం అధికారులు రైతుల ఆకాంక్షకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. పి.మరువపల్లికి 8 కి.మీ దూరంలోనే ఉన్న పెనుకొండ నగర పంచాయతీలోని ఉరివాకిలి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రూ.2 లక్షలతో ప్రత్యేకంగా పూల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నగర పంచాయతీ అధికారులు తెలిపారు. దళారుల బారిన పడకుండా అండగా ఉండేలా మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

ప్రతి వారం ఆదాయం



ఎకరం భూమిలో కనకాంబరాల పూలను సాగు చేశాను. దాదాపుగా రూ.3 లక్షల వరకు ఖర్చు వచ్చింది. పంటకాలం మూడేళ్లు కావడంతో వారంలో మూడు, నాలుగు సార్లు పూలను కోస్తున్నాం. కోసిన ప్రతిసారి 4 నుంచి 6 కేజీల వరకు దిగుబడి వస్తోంది. ఖర్చులు పోను మూడేళ్లలో రూ.5 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. – మాధవి మహిళా రైతు, మరువపల్లి

కరువును జయించాం



పూల సాగులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాఊరి పేరు ఉండటం మా గ్రామానికి గర్వకారణం. పూలను ఎక్కువగా పండించటం వల్లనే మా ఊరికి పూల మరువపల్లిగా పేరొచ్చింది. కరువును జయించడంతో పాటు నిత్యం కష్టపడుతూ అందుతగ్గట్లుగా ఫలితం కూడా పొందుతున్నాం.

– నారాయణ, పి.మరువపల్లి

రెండు దశాబ్దాలుగా పూల అమ్మకం



రెండు దశాబ్దాలుగా గ్రామంలో పండిన పూలను కేజీల ప్రకారం కొనుగోలు చేస్తున్నా. వాటిని అల్లిన తర్వాత పట్టణంలో విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నా ముగ్గురు బిడ్డలను ఉన్నతంగా చదివించేందుకు పూల అమ్మకం ఎంతో దోహదపడింది.

– రామాంజినేయులు, పూల వ్యాపారం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



రబీలో దాదాపుగా 40 ఎకరాల వరకు పి.మరువపల్లిలో వివిధ రకాల పూలు సాగు చేస్తుంటారు. చామంతి, రోజా, లిల్లి, హైబ్రీడ్ మల్లి, హైబ్రీడ్ కనకాంబరాలకు ప్రభుత్వం ఒక హెక్టార్‌కి రూ.16 వేలను సబ్సిడీగా ఇస్తోంది. పూల సాగు చేసే రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నాం. రైతులు ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.

–రామ్‌ప్రసాద్, ఉద్యానశాఖ అధికారి



(గరిష్టం)	
హిందూపురం	35.0
పెనుకొండ	38.0
మడకశిర	35.0

రాగి పంట సాగుపై అవగాహన

పెనుకొండ రూరల్: చిరుధాన్యలలో భాగమైన రాగి విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఇవ్వడంతో పాటు ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3,578 ప్రకటించినట్లు ఏడీ స్వయంప్రభ తెలిపారు. బుధవారం మండలంలోని గుట్టురూ, మునిమడుగు గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులతో సమావేశమై రాగి పంట సాగుపై అవగాహన కల్పించారు.

సజావుగా చేపల చెరువు వేలం

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ నేత్రావతి అధ్యక్షతన శిరివరం-మానేపల్లి ఉమ్మడి చెరువులో చేపల వేలం పాటను నిర్వహించారు. శిరివరం-మానేపల్లి ఉమ్మడి చెరువు రూ. 1.65 లక్షలు, గోపిందేవరపల్లి చెరువు రూ. 65 వేలు చొప్పున శిరివరానికి చెందిన శ్రీనివాసులు దక్కించుకున్నారని పంచాయితీ కార్యాదర్శి రామాంజినేయులు తెలిపారు.

పనిచేయకపోతే బదిలీపై వెళ్లిపోండి



ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానిస్తున్న అధికారులు

పావగడ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహించడం ఇష్టం లేకపోతే బదిలీ పై వేరే చోటుకు వెళ్లిపోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యులు, అధికారులపై స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీపీఎస్ మీటింగ్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ప్రగతి పరిశీలన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తిరుపతయ్య, రామాంజినప్ప, శ్రీనివాస్ మధ్య చోటు చేసుకున్న ఘర్షణ నేపథ్యంలో వారిని హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు లంచాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయని, అయినా కూడా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయకుండా ఎందుకు సతాయిస్తున్నారని విద్యుత్‌శాఖ అధికారులపై ఎమ్మెల్యే వెంకటేశ్ మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, టీపీఎస్ ఈఓ శివరాజయ్య, ఏఓ రంగనాథ్ తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు రత్నమ్మ, బాజయ్య పాళ్యం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.1,56,971 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ సున్న వడ్డీ (డ్వాక్రా) ద్వారా రూ.855, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.82 వేలు, వైఎస్సార్ రైతు భరోసా రూ.40,500, వైఎస్సార్ పంటల బీమా రూ.4,616, జగనన్న అమ్మఒడి కింద రూ.29 వేలు లబ్ధి పొందారు. మాలాంటి నిరుపేదలకు సీఎం జగన్ చేసిన మేలును జీవితాంతం మర్చిపోమని, మళ్లీ ఆయనే అధికారంలోకి వచ్చి సీఎం కావాలని రత్నమ్మ తెలిపారు.



రొళ్ల మండలం బాజయ్యపాళ్యం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాష్ట్రంలో నిరుపేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని రత్నగిరి సచివాలయం పరిధిలోని బాజయ్యపాళ్యం, రత్నగిరిగొల్లహట్టి గ్రామాల్లో రెండోరోజు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ చిన్న రంగప్ప, ఎంపీటీసీ జగదీష్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తునే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. కురుబరహట్టి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన సిద్ధప్ప అనారోగ్యం కారణంగా ఏడాది నుంచి ఇంటికే పరిమితం కావడంతో తక్షణమే పింఛన్ మంజూరు చేయించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించడంతో పాటు గ్రామ నడిబొడ్డున కూలడానికి సిద్ధంగా ఉన్న పెద్ద రావి చెట్లను తీసివేయాలని ప్రజలు విన్నవించుకున్నారు.

ప్రతిపక్షాల మాటలను జనం నమ్మరు

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేన్నారు. ఎన్నికల దగ్గర పడుతున్న సమయంలో మాజీ సీఎం చంద్రబాబు బూటకపు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఎన్ని మాయ మాటలు చెప్పినా వారు వినేపరిస్థితుల్లో లేరన్నారు. గతంలో డ్వాక్రా మహిళల రుణమాఫీ చేస్తామని చెప్పి మహిళలను మోసగించడంతో పాటు అప్పుల పాలు చేశారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు తిరిగి యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ ఎన్ని యాత్రలు చేసినా వృథానేనన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసి వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. తర్వాత గుడ్డగుర్కిలోని ఆర్‌బీకేను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, కార్యదర్శి రచన, ఏపీఎం నాగరాజు, హౌసింగ్ ఏఈ మనప్ప, ఎస్‌ఐ వెంకటరమణ, ,వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగలమడకలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ద్వితీయ సంవత్సరం పీయూ విద్యార్థి సుధీర్ (18) మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు బైకులో పావగడ వైపునకు వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొనడంతో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అమరాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా మాస్టర్ కిశోర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ముందుగా ప్రార్థన యోగా తదితర వాటిని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చదువుంటేనే ఏదైనా చేయవచ్చన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం, గుర్తించడం, రాయడం కచ్చితంగా నేర్చుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట పూజలు



కలశస్థాపన పూజలు నిర్వహించిన దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న సచ్చినంద సరస్వతీ స్వామి

హిందూపురం: హిందూపురం డీబీ కాలనీ వద్ద పునః నిర్మించిన ఆలయంలో అష్టలక్ష్మీ సమేత వాసవీమాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అష్టలక్ష్మీ వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శ్రీవాసవీ పీఠాధిపతులు సచ్చినంద సరస్వతీ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అంతర్రాష్ట్ర బస్సుల్లో ఫ్రీ పాస్ వర్తించదు

పావగడ: కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన అంతర్రాష్ట్రీయ బస్సుల్లో ఫ్రీ పాస్ వర్తించదని కేఎస్ఆర్‌టీసీ డిపో మేనేజర్ హనుమంతప్ప కేడీపీ సమావేశంలో తెలిపారు. పావగడ నుంచి తుమకూరు, బెంగళూరుకు వెళ్లాలంటే ఏపీలోని మడకశిర దాటి వెళ్లాల్సి వస్తుంది. మడకశిర మీద వెళ్లే కేఎస్ఆర్‌టీసీ బస్సులు అంతర్రాష్ట్రీయ బస్సుల జాబితాలో ఉండటంతో పావగడ మహిళలు ఫ్రీ బస్‌పాస్‌లకు దూరం కావాల్సిందే. అయితే ఎలాగైనా ప్రభుత్వాన్ని ఒప్పించి మడకశిర మీదుగా వెళ్లే కర్ణాటక బస్సుల్లో ఫ్రీ పాస్ వర్తించేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండలంలోని కలిపి గ్రామంలో బుధవారం నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆయనతో పాటు ఎంపీపీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలసాగుపై అవగాహన

మడకశిర (అగళి): అగళి మండల పరిధిలోని ఇనగలూరు, హళ్లికెర రైతు భరోసా కేంద్రాల ఆవరణలో బుధవారం ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు ముద్దరాజు, మంజమ్మ, నాయకులు గిరీష్‌గౌడు, నటరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రొద్దం: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య పేర్కొన్నారు. మండలంలోని కంచిసముద్రం గ్రామంలో అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన, దిశాచట్టం, గృహ హింస, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీలో చేర్పించండి

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఉదయం అంగన్‌వాడీ బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు సంవత్సరాల ఆరు నెలలు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సీహెచ్‌ఓ హుస్సేన్‌బీ, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడాలి



ప్రాణాలు కాపాడే విధానాన్ని చూపుతున్న డీఎస్పీ, సిబ్బంది

పెనుకొండ: రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని, ఇందుకు మెళకువలు, తక్షణ ప్రత్యేక వైద్య చర్యలు ఎంతో అవసరమని డీఎస్పీ హుస్సేన్‌పీరా పేర్కొన్నారు. పట్టణంలోని ఎంక్యూఏ గ్లోబల్‌ట్రస్ట్‌లో కియా సిబ్బంది, పోలీసులు, మహిళా సిబ్బందికి ప్రత్యేక అవగాహనా సమావేశం నిర్వహించారు. హిందూపురంకు చెందిన డాక్టర్ విశ్వనాథరెడ్డి పలు సూచనలు, సలహాలిచ్చారు. సీఐ కరుణాకర్, ఎస్ఐ. రమేష్‌బాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాసులు ఇవ్వాలి

హిందూపురం టౌన్: ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు కళాశాలలు ప్రారంభమయ్యాయని, విద్యార్థులకు వెంటనే ఆర్టీసీ బస్సు పాసులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి కోరారు. చాలా మంది విద్యార్థులు బస్సు పాసులపై ఆధారపడి కళాశాలలకు వస్తున్న విషయాన్ని అధికారులు గమనించాలన్నారు.

సచివాలయం పరిశీలన

గోరంట్ల: మండలంలోని మల్లాపల్లి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీపీ ప్రమీల, ఎంపీడీఓ రఘునాథగుప్తా సందర్శించారు. వైఎస్సార్ బీమా అమలుతో పాటు రైతులకు సబ్సిడీతో అందిస్తున్న విత్తన పంపిణీ వివరాలను సచివాలయ ఉద్యోగులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి వాక్సినేషన్ అమలు తీరును పరిశీలించారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: మండలంలో జాతీయ ఉపాధి పనులపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవనపల్లి పంచాయతీ ఉప్పార్లపల్లి చెరువులో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులు ఏవిధంగా జరుగుతున్నాయి? ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు? తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.